పండగ వేళా పస్తులే..!

దయనీయంగా దర్జీల జీవనం

- రెడీమేడ్ వస్త్రాలతో పనుల్లేక ఇబ్బందులు
- గతంలో రూ.10 వేలు అందించిన అప్పటి సీఎం వైఎస్ జగన్
- ప్రస్తుతం రూపాయీ ఇవ్వని కూటమి పాలకులు


బడ్డీలో దుస్తులు కుడుతున్న టైలర్ సీహెచ్ సాంబమూర్తి


టైలరింగ్ చేస్తున్న మహిళ అరుణ

సీతమ్మధార : ఒకప్పుడు తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి వస్తుందంటే చాలు టైలర్లు రేయింబవళ్లు దుకాణాల్లో ఉండిపోయి దుస్తులు కుడుతూ బిజీగా కనిపించేవారు. చేతినిండా పని ఉండడంతో కడుపు నిండా తినేందుకు ఏ ఇబ్బందీ ఉండేది కాదు. ఆర్థికంగా భరోసా లభించేది. అయితే కొన్నేళ్లుగా రెడీమేడ్ వస్త్ర దుకాణాల ప్రభావంతో దర్జీల జీవనమే మారిపోయింది. అందరూ రెడీమేడ్ వస్త్రాలే కొనుగోలు చేయడంతోపాటు దుస్తులు కుట్టించే వారు లేక పని లేకుండా పోయింది. ఫలితంగా పండగ వేళా దర్జీలు, వారి కుటుంబ సభ్యులూ పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

టైలర్లు కొంతకాలంగా పెళ్లి దుస్తులు, సీనియర్ సిటిజన్ల దుస్తులు కుట్టేందుకు మాత్రమే బేరాలు వస్తున్నాయి. సఫారీలు, సూట్ల కోసం కూడా కొందరు టైలర్లను ఆశ్రయిస్తున్నారు. అంత కుమించి ఏ పనీ దొరకడం లేదని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1990 దశకంలో రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్ల జీవితాలు ఛిన్నాభిన్నం అయ్యాయనే చెప్పుకోవాలి. అందుబాటు ధరలకే ఫ్యాంట్లు, షర్టులు, టీషర్టులు షాపుల్లో విక్రయించడంతో యువకులంతా అటువైపే మొగ్గు చూపడం మొదలయింది. అప్పటి నుంచి దర్జీలకు పని తగ్గిపోయింది. ఇక సీనియర్ సిటిజన్లు మాత్రం ఎప్పటిలాగానే క్లాత్‌పీసులు కొనుగోలు చేసి టైలర్ల వద్ద ఫ్యాంట్లు, షర్టులు కుట్టిస్తుండడంతో కొంత వరకూ ఉపాధి పొందుతున్నారు.

సంపాదన అంతంతమాత్రమే

టైలర్లు రోజూ ఉదయం 9 గంటలకల్లా దుకాణానికి వెళ్లి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తుంటారు. కానీ సంపాదన మాత్రం కుటుంబ అవసరాలకు సరిపడా రీతిలో లేదని టైలర్లు ఆవేదన చెందుతున్నారు. రోజుకి కనీసం వెయ్యి రూపాయల సంపాదన కూడా రావడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె, కుటుంబ పోషణకు అధిక మొత్తంలో ఖర్చు అవుతోందని వాపోతున్నారు. ఇక వివాహాల సీజన్‌లో మాత్రం కాస్త మెరుగైన రీతిలో బేరాలుంటున్నాయని టైలర్లు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకం కింద ఏడాదికి అందించిన రూ.10 వేలు కొంత అవసరాలకు ఉపయోగపడేవని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎటువంటి చేయూత, భరోసా లభించడం లేదని టైలర్లు వాపోతున్నారు.

ప్రస్తుతం రెడీమేడ్ ఫ్యాంట్లు సైజ్ చేయించడం, ప్యాచ్‌వర్కులకు మాత్రమే బేరాలు వస్తున్నాయని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టైలరింగ్ దుకాణాల్లో ఫ్యాంట్, షర్టుకి కలిపి కుట్టేందుకు రూ.550 నుంచి ఆపైనే వసూలు చేస్తున్నారు. అదే రెడీమేడ్ దుకాణంలో అయితే ఈ ధరకు షర్టు, ఫ్యాంట్ వస్తున్నాయని యువకులు భావిస్తుండడం కూడా టైలర్లకు పని దొరక్కపోవడానికి కారణమనే చెప్పుకోవాలి.



షాపింగ్ మాల్స్‌లోనే ఉపాధి..

రెడీమేడ్స్ వస్త్రాల దెబ్బకు ఎంతో మంది టైలర్లు కుదేలైపోయారు. చాలా మంది టైలర్లు పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ విక్రయించే ఫ్యాంట్లు, ఇతర రెడీమేడ్స్ దుస్తులకు సైజు చేయడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం దాదాపుగా 8 వేల మంది టైలర్లు ఉన్నారని అంచనా. తమకు జీవీఎంసీ ట్రేడ్‌లైసెన్సు రుసుము నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్నాళ్ల నుంచి కోరుతున్నా ఫలితం లేకపోతోందని టైలర్లు ఆందోళన చెందుతున్నారు.

బేరాలు తగ్గిపోయాయి

రెడీమేడ్స్ రాకతో టైలర్లకు బేరాలు బాగా తగ్గిపోయాయి. ఫలితంగా కుటుంబ పోషణ కష్టంగా మారింది. సీనియర్ సిటిజన్లు మాత్రమే మా వద్ద దుస్తులు కుట్టించుకుంటున్నారు. యువకులంతా రెడీమేడ్స్ వైపే మొగ్గు చూపుతున్నారు. రానురాను టైలర్లకు బేరాలు తగ్గిపోతున్నాయి.
– అరుణ, కేఆర్‌ఎం కాలనీ

రూ.10వేల సాయం పోయింది

గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి టైలర్లకు ఏటా రూ.10వేల వంతున చేయూత పథకం కింద అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఆర్థిక సాయం అందించడం లేదు. ఒకవైపు బేరాలు లేక మరోవైపు రూ.10వేల సాయం లేక టైలర్ల పరిస్థితి దుర్భరంగా తయారైంది.
– సీహెచ్.సాంబమూర్తి, సీతమ్మధార

డాక్టర్ లక్ష్మణరావుకు సత్కారం


లక్ష్మణరావును సత్కరిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) కెమికల్ హెడ్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్ బీవీ లక్ష్మణరావును ఆదివారం సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.సత్యనారాయణ అతిథిగా పాల్గొని లక్ష్మణరావును సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన లక్ష్మణరావు మాస్టారును అందరూ ఆదర్శంగా తీసుకోవాలలని సూచించారు. కార్యక్రమంలో గైస్ హెచ్‌వోడీలు సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఆర్‌జేడీ కార్యాలయం సిబ్బంది జోషి, జగదీష్, రామ్‌జీ పాల్గొన్నారు.

8 నుంచి 'అడవివరం' సొసైటీ సభ్యులకు డివిడెండ్

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు సంక్రాంతి కానుకగా ఈ నెల 8 నుంచి 20 వరకు డివిడెండ్‌లు పంపిణీ చేస్తామని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. సొసైటీ మహాజన సభ ఆదివారం ఒక ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిఫ్టు డిపాజిట్ రూ.1.75 కోట్లపై 8 శాతం, షేర్ క్యాపిటల్ రూ.49 లక్షలపై 20 శాతం డివిడెండ్ రూపంలో అందిస్తామన్నారు. సొసైటీ రూ.152 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. రూ.92.92 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్నట్లు తెలిపారు. సొసైటీ మూడు బ్రాంచిల్లో సూమారు ఆరున్నర కిలోల బంగారు వస్తువులు దీర్ఘకాలికంగా తనఖాలో ఉన్నాయని, వాటిని బహిరంగ వేలం ద్వారా ఆక్షన్ వేస్తామన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు బోర ప్రసాద్‌రెడ్డి, కొలుసు గురునాథ్, కోరాడ ఈశ్వరరావు, మజ్జి ధర్మరాజు, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్



ఆసక్తిగా కథ వింటున్న పిల్లలు

సీతంపేట : విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా లైబ్రరీ మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం చిన్నారులను ఆకట్టుకునేలా ఉత్సాహంగా సాగింది. చందమామ కథ వ్యవస్థాపకురాలు శ్రీకరుణ ఆకర్షణీయమైన కథలు, సృజనాత్మక అంశాలతో పిల్లలను ఉర్రూత లూగించారు. 'ది హ్యాట్ సెల్లర్ అండ్ ది మంకీస్' కథను, పంచతంత్రంలోని 'ఒక కాలం' కథను టాయ్స్‌తో చక్కగా వివరించారు. అలాగే మంచితనం యొక్క బలం, స్నేహం, సమస్యల నుంచి పరిష్కారం కనుగొనే 'ది బేబీ ఎలిఫెంట్ అండ్ ది బన్నీ రాబిట్' నీతి కథను బోధించారు. పిల్లలను ఆకట్టుకునేలా తోలు బొమ్మలు, టోపీలు ఉపయోగించి సృజనాత్మకంగా కథలు బోధించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పునర్వినియోగం, రీసైక్లింగ్ ప్రాముఖ్యత వివరించేలా ది క్లీవర్ టైలర్ జానపద కథ పిల్లలను ఆలోచింపజేసింది.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా కేరళీయుల వేడుకలు


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న కేరళ కళా సమితి సభ్యులు

మురళీనగర్ : నగరంలోని కేరళీయుల క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. బిర్లా కూడలిలోని కేరళ కళాసమితి ప్రాంగణంలో ఆదివారం సాయత్రం సమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌ఆర్‌కే (నాన్ రెసిడెంట్స్ కేరలైట్స్ అసోసియేషన్) డవలప్‌మెంట్ ఆఫీసర్ అను పి.చకో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేరళీయులకు, తెలుగు ప్రజలకు ఈ ఏడాదంతా విజయాలు చేకూరాలన్నారు. ఎన్‌ఎస్‌టీఎల్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ ఎలన్ అబ్రహాం ప్రసంగించారు. మార్తోమా చర్చి ఫాదర్ బ్లెసన్, ఆర్థడాక్స్ చర్చి ఫాదర్ జిబిన్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కేరళీయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. సమితి కార్యదర్శి లైలా గణేషన్, కోశాధికారి సురేష్ పాల్గొన్నారు.

'వాహనమిత్ర' అమలుకు డిమాండ్


రామాటాకీస్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామాటాకీస్ కూడలి వద్ద శ్రీరామ ఆటో స్టాండ్ డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాహన మిత్ర పథకంలో భాగంగా ఏడాదికి రూ.15వేలు వెంటనే అందజేయాలని, జీవో నంబర్లు 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పింఛన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలని కోరారు. నగర పరిధిలో ఉబర్, ఓలా, రాపిడో వాహనాలు నిషేధించి ఆటో డ్రైవర్ల ఉపాధికి భద్రత కల్పించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గిస్తామన్న హామీ పదేళ్లుగా అధికారంలో ఉన్నా నెరవేర్చలేదన్నారు. 2023 నూతన మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేసి, పెట్రోల్, డీజిల్ ధరలు జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్.యోహాన్, పి.శ్రీనివాసు, ఎ.దుర్గాప్రసాద్, పైడిరెడ్డి చిన్న రెడ్డి, ఎస్.రాము, ఎ.సురేష్, కె.శివ పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా రక్షణ గోడ


వివేకానందనగర్‌లో ప్రమాదకరంగా మారిన రక్షణ గోడ

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి వివేకానంద నగర్ గ్రీన్‌బెల్ట్ రక్షణ గోడ కూలేందుకు సిద్ధంగా ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిలో నిర్మించిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌కు ప్రహరీగా ఉన్న రక్షణ గోడలు ప్రమాదభరితంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు ఆనుకుని ఉన్న డెబ్రిస్ భారానికి గోడలు ప్రమాద భరితంగా మారాయని చెబుతున్నారు. సచివాలయ సిబ్బందికి, ఇంజినీరింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందించే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రస్తుతం ఇటువైపు చూడడమే లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన వినోదాల విందు


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం వినోదాల విందు పేరిట నిర్వహించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, నాయుడు, పోర్ట్ శేషు, ఇమంది ఈశ్వరరావు, రమేష్, శివ జ్యోతి, సీత, వెంకటేశ్వరరావు, పుష్యమి, సంధ్యా ప్రియదర్శిని ప్రదర్శించిన స్కిట్స్, చెప్పిన జోక్స్ కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో జ్యోతి ప్రజ్వలన, అకౌంటెంట్ పోస్టు, ఎస్‌ఐ కానిస్టేబుల్, సుబ్బారావు పెళ్లి, సన్మానం, డాక్టర్ పేషెంట్, అమ్మాయి చుట్టూ, బెల్జియం అద్దం, మూడు మాత్రలు, పెళ్లి చూపులు, సేవ్ ఫుడ్ కామెడీ స్కిట్స్ నవ్వులు పండించాయి. ముందుగా హరిహర నృత్య నికేతన్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు అనూష, అనన్య, శరణ్య ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ అలరించింది. కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, వి.వి.కృష్ణంరాజు, మాల్యాద్రి, శివకుమార్ కళాకారులను సత్కరించారు.

కూటమి రంగు బయట పడింది


మాట్లాడుతున్న పిట్టా రెడ్డి

అగనంపూడి: అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లో కూటమి ప్రభుత్వం అసలు స్వరూపం బయటపడిందని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారం ఇస్తే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని చెప్పి నేడు కనీసం నోరుమెదపకపోవడంతో వీరి బాగోతం ప్రజలకు అర్థం అయిందన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరడం మానేసి మిట్టల్ నిర్మిస్తున్న స్టీల్ ప్లాంట్‌కు లైసెన్స్, ఇనుప గనులు కేటాయించాలని ప్రధాని మోదీని కోరడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు విశాఖలో అడుగు పెట్టే హక్కు ప్రధానికి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, గొందేశి ప్రభాకర్ రెడ్డి, మద్ది అప్పలరాజు, బైరెడ్డి అప్పలరెడ్డి, గొందేశి మంగరాజు పాల్గొన్నారు.


కొండవాలులో అంధకారం

- వీధుల్లో వారం రోజులుగా వెలగని విద్యుత్ లైట్లు
- స్పందించని జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు
- భయాందోళనలో స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..


కప్పరాడ కొండవాలు ప్రాంతంలో విద్యుత్ లైట్లు వెలగక అంధకారం


రాంజీ ఎస్టేట్‌లో విద్యుత్ లైట్లు వెలగక చీకటి


అరుంధతినగర్‌లో దుకాణాల్లోని లైట్ల వెలుగుల్లో రహదారి

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కొండవాలు ప్రాంతాల్లో గత వారం రోజులుగా అంధకారం నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాంజీ ఎస్టేట్, కప్పరాడ, సంజీవయ్య కాలనీ, అంబేడ్కర్ ఎస్టేట్, జవహరలాల్‌నగర్, పెదకొత్తూరు, తిక్కవానిపాలెం కాలనీ, తదితర కొండవాలు ప్రాంతాల్లో నిత్యం చీకట్లు కమ్ముకుంటున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఒకటి రెండు రోజులైతే ఆకతాయిల పనిగా భావించవచ్చని... గత పది రోజులుగా వీధుల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యమే కారణమని స్థానికులు వాపోతున్నారు. సచివాలయాల్లో సిబ్బందికి ఫిర్యాదులు చేసినా నిర్లక్ష్యంగానే సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు, పాదచారులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్ – 5 విద్యుత్ దీపాల నిర్వహణ అధికారులు స్పందించి వార్డులో వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగింది. సంఘ సభ్యులు సమక్షంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సానాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యులైన గిరిజన ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు ఉద్యోగుల చలో కలెక్టరేట్


వడ్లపూడి నిర్వాసితకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, నిర్వాసితులు


అగనంపూడి నిర్వాసితకాలనీల్లో..

విజయవంతం చేయాలని నేతల పిలుపు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్‌తో సోమవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి నిర్వాసితకాలనీలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తున్నామని ప్రకటించాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్‌తో నిర్వహించనున్న ర్యాలీలో నిర్వాసితులు, కార్మికులు, మద్దతుదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, విజయరామరాజు, ఎన్నేటి రమణ పాల్గొన్నారు.

- విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసే వరకూ పోరాటం ఆగదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు కె.సత్యనారాయణరావు అన్నారు. సోమవారం నాటి కలెక్టరేట్ బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, కరణం పైడిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, శీరంశెట్టి గోవిందరావు, కొలిపాక అప్పారావు, పట్టా రమేష్, చిత్తా అబ్బాయి పాల్గొన్నారు.

ఆత్మీయుల అపూర్వ కలయిక



ఆత్మీయంగా కలుసుకున్న సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మురళీనగర్ : నగరంలోని స్థానిక సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో పదో తరగతి (1986 – 87వ బ్యాచ్) చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. బాల్య స్నేహితులు అంతా ఓ చోటకు చేరి ఆనాటి జ్ఞాపాలు గుర్తుకు తెచ్చుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులతోపాటు వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, ప్రజాప్రతిధులు కలుసుకున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రాము, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ, ప్రముఖ న్యాయవాది కోడి శ్రీనివాస్‌రావు స్నేహితులతో గడిపిన క్షణాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, సర్వేయర్ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ప్రసన్న కుమార్, విజయ్, భూపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.